క్లుప్తంగా

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

పిఠాపురం: ఈ నెల 14వ తేదీన ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని చేయూత స్వచ్ఛంద సేవా సంఘం నిర్వాహకుడు రవికుమార్ కోరారు. పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెంలో ముమ్మిడి శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ యువత సేవా దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు. సమావేశంలో అనుసూరి గోపి, లక్ష్మణ్, ముమ్మిడి శ్రీను, నరేంద్ర, రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యోగా తరగతులు



శిక్షణ శిబిరంలో యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు

పిఠాపురం: కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ యువజన సంక్షేమ శాఖ(సెట్రాజ్), జిల్లా గ్రంథాలయం ఆధ్వర్యంలో గత నెల రోజులుగా పిఠాపురంలో నిర్వహిస్తున్న యోగా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఏపీ యోగా విద్యా పీఠం యోగా గురువు చిట్టిబాబు, ఏపీ యోగా అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జ్ యోగా కోచ్ వనం సత్యప్రియ, యోగా గురువు వెంకట్, గ్రంథాలయాధికారి రేపాక వెంకటరాము తదితరుల ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాలో శిక్షణనిచ్చారు. శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కొండేపూడి శంకర్రావు, ఎ.నగేష్, ప్రసాద్ మాస్టారు, రామచంద్రరావు, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ సీహెచ్ సుధాదేవి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



కూరగాయల మార్కెట్ వ్యాపారస్తులకు హెచ్చరికలు జారీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై

సామర్లకోట: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ రోడ్లపైకి చిరు వ్యాపారులు వస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు హెచ్చరించారు. స్థానిక మఠం సెంటర్‌లో మామిడి పండ్ల వ్యాపారస్తులు రోడ్డు మధ్యలో మామిడి పండ్ల దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని పలువురు ట్రాఫిక్ ఎస్సైకు ఫిర్యాదు చేశారు. దాంతో రాకపోకలకు అంతరాయం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని మామిడి పండ్ల వ్యాపారులకు సూచించారు. పెద్దాపురం రోడ్డులోని నంబరు 2 కూరగాయల మార్కెట్‌లో వ్యాపారస్తులు రోడ్డుపైకి సరకులను పెట్టుకోవడం వలన సైకిళ్లు, మోటారు సైకిళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో వ్యాపారస్తులకు హెచ్చరికలు జారీ చేశారు.

మాజీ ఎంపీపీ మృతి



రమేష్ (ఫైల్)

పెద్దాపురం: మాజీ ఎంపీపీ గుడాల రమేష్(58) ఆదివారం ఉదయం మృతి చెందారు. కొన్ని రోజులుగా మెదడుకు సంబంధించిన సమస్యతో బాధపడుతూ కాకినాడలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం తెల్లవారు జామున పరిస్థితి విషమించడంతో మృతి చెందారు.

గ్రహణం మొర్రికి ఉచిత శస్త్ర చికిత్సలు



ప్రచార కరపత్రాన్ని విడుదల చేస్తున్న డాక్టర్ నరసింహం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో గ్రహణం మొర్రి బాలలకు ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు(డీఎంఈ), ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. ముత్తూట్ ఫౌండేషన్, కాకినాడ జీజీహెచ్ సంయుక్త ఆధ్వర్యంలో మిషన్ స్మైల్ పేరుతో నిర్వహించనున్న ఈ శస్త్రచికిత్సలు జూలై ఒకటి నుంచి నాలుగవ తేదీ మధ్య నాలుగు రోజుల పాటు జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి పర్యవేక్షణలో ఉచితంగా జరుగుతాయన్నారు. ప్రచార కరపత్రాన్ని డాక్టర్ నరసింహం కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో ఆదివారం విడుదల చేశారు. బాధిత బాలలు వారి తల్లిదండ్రులకు ప్రయాణ ఖర్చులు, ఆహార సదుపాయాలు సంస్థ ఉచితంగా కల్పిస్తారని నిర్వాహకులు తెలిపారు. తమ పిల్లలకు గ్రహణం మొర్రి శస్త్ర చికిత్స చేయించాలనుకునే తల్లిదండ్రులు సమీపంలో ఉన్న ముత్తూట్ ఫిన్ కార్ప్ బ్రాంచ్‌లో లేదా 99853 20492, 99127 08690 నంబర్లకు ఫోన్ చేసి తమ పిల్లల పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

మండు వేసవిలో విజ్ఞాన వీచికలు

- ఆదివారంతో ముగిసిన వేసవి శిక్షణ శిబిరం
- విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్ అందజేస్తున్న సాయిరామకృష్ణ. పక్కన గ్రంథాలయాధికారిణి రత్నమణి

సామర్లకోట: నెల రోజుల పాటు గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం విద్యార్థుల్లో విజ్ఞానాన్ని నింపింది. విద్యార్థులకు ఇంగ్లిష్ స్పీకింగ్ కోర్సు గ్రామర్, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, దేశభక్తి గేయాలు, పర్యావరణ పరిరక్షణ, మాతృదినోత్సవం, నీతి కథలు చెప్పడం, కథలు రాయడంతో పాటు చెస్‌పై శిక్షణ నిర్వహించారు. విద్యార్థులను గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి క్విజ్ పోటీలు ఏర్పాటు చేయడంతో వారిలో విజ్ఞానం పెరగడానికి శిబిరం దోహదపడింది. ప్రతీ రోజు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వేసవి శిక్షణలో అనేక విషయాలను నేర్చుకున్నారు. గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ద్వారా అనేక విషయాలు తెలుసుకున్నామని తెలిపారు. ప్రతీ వారం విద్యార్థులు నేర్చుకున్న విషయాలపై ఇతరులకు అర్థం అయ్యే విధంగా వారి నుంచి చెప్పించడంతో వారిలో స్టేజ్‌పై మాట్లాడే ధైర్యం ఏర్పడింది. వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు ఒకేచోట చేరడంతో స్నేహం ఏర్పడి ఒకరి నుంచి మరొకరు అనేక విషయాలను తెలుసుకున్నారు. వేసవి సెలవులు అనగానే పిల్లలు ఎండను సైతం లెక్క చేయకుండా ఆటలు ఆడుతుంటారు. దాంతో ఎండల వలన పిల్లల ఆరోగ్యం దెబ్బ తినే అవకాశం ఉంటుంది. ఇటువంటి కార్యక్రమాల వలన విద్యార్థుల్లో విజ్ఞానం పెరగడంతో పాటు చదువుపై ఆసక్తి పెరిగి పోటీతత్వం ఏర్పడుతుందని తల్లిదండ్రులు తెలియజేస్తున్నారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ చేతుల మీదుగా ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు.

కొత్త స్నేహితులు లభించారు



నెల రోజుల పాటు గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం వలన అనేకమంది కొత్త స్నేహితులు లభించారు. ఇంగ్లిషు స్పీకింగ్ కోర్సు నేర్పించారు. నీతికథల పుస్తకాలను చదువుకున్నాం. పుస్తకాలు చదవాలనే ఆసక్తి పెరిగింది. దాంతో ప్రతీరోజు ఒక గంట గ్రంథాలయానికి కేటాయించాలని నిర్ణయించుకున్నాను.

– జి.జోత్స్న, విద్యార్థిని, సామర్లకోట

కొత్త విషయాలు తెలుసుకున్నా



గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఎంతో విజ్ఞానాన్ని పంచింది. జాతీయ సాంకేతిక దినోత్సవం, అంతర్జాతీయ పక్షుల దినోత్సవం, మాతృదినోత్సం గురించి తెలుసుకున్నాను. అనేక దేశభక్తి గేయాలు నేర్చుకున్నాను. శిక్షణ ద్వారా అనేక కొత్త విషయాలు తెలుసుకున్నాను.

-ఎడీవీ మునేశ్వరీ, విద్యార్థిని, సామర్లకోట

సంతృప్తి మిగిల్చింది

వేసవి శిక్షణ శిబిరాన్ని గత నెల 8న శిక్షణ ప్రారంభించి ఆదివారం ముగింపు సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశాం. ప్రతీ రోజు ఒక ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వచ్చి విద్యార్థులకు అనేక విషయాలు తెలియజేశారు. ఈ కార్యక్రమం సంతృప్తి మిగిల్చింది.

– బందిల రత్నమణి, గ్రంథాలయాధికారిణి, సామర్లకోట

నేటి నుంచి పాఠశాలలు

సామర్లకోట: వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి పాఠశాలలు తెరవాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలలు తెరచిన రోజునే జగనన్న విద్యాకానుక కిట్లు కూడా విద్యార్థులకు అందజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మండల స్థాయిలో కిట్లను భద్రపర్చారు. అయితే ఎండవేడి తగ్గకపోవడంతో ఉదయం 7.30 నుంచి 11.30 వరకు ఒంటి పూట మాత్రమే పాఠశాలలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఎంఈఓ వై.శివరామ కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 11.30 తరువాత 12.30 మధ్యాహ్నం భోజనం ఉంటుందన్నారు. అనంతరం జగనన్న విద్యాకానుక కిట్లు పాఠశాల వారీగా అందజేస్తామని చెప్పారు.

నేడు పిఠాపురంలో కేంద్ర మంత్రి పర్యటన

పిఠాపురం: కేంద్ర విదేశాంగ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వెల్లంవెల్లి మురళీధరన్ సోమవారం పిఠాపురం మండలంలో పర్యటించనున్నట్లు పిఠాపురం ఎంపీడీఓ చిన్నారావు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెం పాపిడిదొడ్డి చెరువులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలిస్తారని చెప్పారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



శిక్షణ పొందిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేస్తున్న దృశ్యం



బహుమతి అందజేస్తున్న కృష్ణబాబు

కొత్తపల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, ప్రతిఒక్కరూ గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ అన్నారు. మండలంలోని ఉప్పాడ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సమావేశానికి హాజరైన ఉమ్మిడి జాన్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ శిబిరాల ద్వారా చిన్నారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయొచ్చన్నారు. వేసవిలోనే కాకుండా రోజూ గ్రంథాలయాలను సందర్శించి పుస్తక పఠనాన్ని కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమలో గ్రంథాలయాధికారిణి టి.నళినీ ప్రియ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

పెద్దాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో 34 రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జోశ్యుల కృష్ణబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బహుమతులను అందజేశారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, సింగం బుల్లియ్య ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొత్తపల్లి: మండలంలోని గోర్స నుంచి కొమరగిరి శివారు ఆనందనగర్‌కు వెళ్లే రోడ్డు సమీపంలోని పంట కాలువలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయసు సుమారు 65 ఏళ్ల నుంచి 70 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని చెప్పారు.

మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఎన్నిక

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడలో ఆదివారం అమలాపురం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు సంబంధించి మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఎన్నికలను రాష్ట్ర అధ్యక్షుడు దువరపల్లి బిక్షాలు ఆధ్వర్యంలో నిర్వహించారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా చాట్ల ఆశీర్వాదం, ప్రధాన కార్యదర్శిగా సవరం వీర్రాజు, కోశాధికారిగి సిద్ధాంతపు బెన్‌జాన్సన్, ఉపాధ్యక్షులుగా కాకడ రామకృష్ణ, రాచర్ల అప్పారావు ఎన్నికయ్యారు. కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా మట్టా నాగేశ్వరరావు, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడిగా కొల్లి శ్యామ్‌సన్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భానుడి భగభగలు



నిర్మానుష్యంగా మారిన ఉప్పాడ-పిఠాపురం రోడ్డు

కొత్తపల్లి: రోహిణి కార్తె వీడి మృగశిర కార్తెలోకి ప్రవేశించినా భానుడి భగభగలు తగ్గడం లేదు. ఉదయం 8 గంటల నుంచే సూరీడు తన ప్రతాపాన్ని చూపిస్తుండడం, సాయంత్రం 6 గంటలైనా ఉక్కబోత తగ్గకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం 10 గంటల దాటిందంటే ప్రజలు బయటకు రావడానికే భయపడిపోతున్నారు. వ్యాపారులు సైతం మధ్యాహ్నం దుకాణాలు మూసేసి ఇళ్లకే పరిమితమైపోతున్నారు. దీంతో మధ్యాహ్నం సమయంలో ప్రధాన రహదారులు సైతం నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పిల్లలు, పెద్దలు సాయంత్రం వేళల్లో సముద్ర తీరానికి చేరుకుంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ కోతలతో పిల్లలు, వృద్ధులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండతాపం నుంచి రక్షించుకునేందుకు ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో పండ్ల రసాలకు, కొబ్బరి బొండాలకు గిరాకీ పెరిగింది.

తగ్గని భానుడి భగభగలు

సామర్లకోట: భానుడు ఆదివారం తన ప్రతాపాన్ని చూపించాడు. 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. ఉదయం ఏడు గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు రోడ్లపైకి రావడానికి భయపడ్డారు. దాంతో రోడ్లు నిర్మానుష్యంగా మారిపోయాయి. ఎండను తాళలేక మహిళలు తమ చీర కొంగులను తలకు చుట్టుకొని ప్రయాణం చేశారు. కొంతమంది గొడుగులను ఎండ వేడి నుంచి రక్షణకు ఉపయోగించుకున్నారు. ఎండలకు భయపడి అనేకమంది చిరు వ్యాపారస్తులు తమ షాపులను మూసివేశారు. గోదావరి కాలువకు నీరు వచ్చినా వడగాడ్పులు మాత్రం తగ్గకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రుతుపవనాలు వచ్చాయని ప్రకటనలు వస్తూ ఉండగా వేడి పెరిగిపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఆరోగ్య కేంద్రం వద్ద డంపింగ్ యార్డు



స్థానిక ఆరోగ్య కేంద్రం వద్ద పడేసిన చెత్త

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్పలో సేకరించిన చెత్తను స్థానిక ఆరోగ్యకేంద్రం వద్ద డంపింగ్ చేస్తుండడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నిత్యం ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రోగులు, స్థానిక ప్రజలు చెత్తకుప్పల నుంచి దుర్వాసన కారణంగా ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తుంది. ఇష్టారీతిన చెత్త పడేస్తుండడం వల్ల అంటు రోగాలు వచ్చే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా వర్షాకాలం ప్రారంభం కానుండడంతో దోమలు స్వైర విహారం చేస్తాయంటున్నారు. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆరోగ్య కేంద్రం వద్ద చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై వాకతిప్ప పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా డంపింగ్ యార్డుకి స్థలం లేకే ఆరోగ్య కేంద్రం వద్ద వేయాల్సి వస్తుందన్నారు.

హజ్ యాత్రికులకు సీఎం జగన్ ప్రోత్సాహకం

రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ బషీరుద్దీన్



సత్కారం పొందిన హజ్ యాత్రికులు

కాకినాడ: పెరిగిన హజ్‌యాత్ర ఖర్చును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు రూ.80వేల చొప్పున ప్రభుత్వపరంగా ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ బషీరుద్దీన్ చెప్పారు. రాష్ట్ర నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న 1,800 మందికి రూ.14.50 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. కాకినాడ నుంచి హజ్‌యాత్రకు వెళ్తున్న ముస్లింలకు ఆదివారం స్థానిక పెద్దమసీదు వద్ద వీడ్కోలు పలికి ఘనంగా సత్కరించారు. వక్ఫ్‌బోర్డు డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మైనార్టీసెల్ ప్రాంతీయ సమన్వయకర్త బషీరుద్దీన్ వీరిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూలేని విధంగా సీఎం జగన్ హజ్ యాత్రీకులను ప్రోత్సహిస్తూ తీసుకున్న నిర్ణయం ముస్లింలకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. హజ్‌యాత్ర సందర్భంగా ఇక్కడి నుంచి వెళ్తున్న ముస్లింలు సీఎం జగన్ మోహన్‌రెడ్డి, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కోసం దువా చేస్తామన్నారు. రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజమ్‌తోపాటు ఇతర మైనార్టీ సెల్ ప్రతినిధులంతా రాయితీ కోసం కృషి చేశారన్నారు. వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్, ప్రభుత్వ ఖ్వాజీ గౌస్‌మోహిద్దీన్, సీరత్‌కమిటీ సభ్యులు నదీముల్లాఖాన్ దుర్రానీ, స్థానిక నాయకులు మున్నా, బహుదూర్, వివిధ మసీదుల ఇమామ్‌లు పాల్గొన్నారు.

వడి బడిగా అడుగులు



పాఠశాలలు ప్రారంభం కాక ముందే సిద్ధం చేసిన పాఠ్య పుస్తకాలు



ఒక రోజు ముందుగానే బడికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

పిఠాపురం: వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి బడులు తెరుచుకోనున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలల ప్రారంభానికి ముందే హడావుడి మొదలైంది. ఒక రోజు ముందే పాఠ్యపుస్తకాలు, జగనన్న విద్యాకానుక కిట్లు, కోడిగుడ్లు వంటి సమస్త సామగ్రి అధికారులు సిద్ధం చేయడం ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులకు అద్దం పడుతుంది. కొత్త పాఠ్య పుస్తకాల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసిన ఉపాధ్యాయులు పాఠశాలలను శుభ్రం చేయించి విద్యార్థుల రాక కోసం సర్వాంగ సుందరంగా సిద్ధం చేశారు. కొత్తగా పోస్టింగ్‌ల్లో జాయిన్ అవ్వడానికి ఉపాధ్యాయులు ఆదివారం ఆయా బడులకు హాజరైతే వారి రాకను చూసి విద్యార్థులు హాజరవ్వడం వారిలో ఉత్సుకతను తేటతెల్లం చేస్తుంది. నాడు-నేడు పనులతో అధునాతన సౌకర్యాల నడుమ ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడుతున్నాయి. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

31 వాహనాలు సీజ్



తునిలో సీజ్ చేసిన వాహనాలతో పోలీసులు

తుని: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 31 వాహనాలను సీజ్ చేసినట్టు పట్టణ సీఐ నాగదుర్గారావు ఆదివారం తెలిపారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో రాత్రి వేళల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పార్క్ సెంటర్, ఎల్ఐసీ బిల్డింగ్ సెంటర్, బాలాజీ రోడ్డు, గొల్లప్పారావు, శ్రీనివాస థియేటర్, ఆర్టీసీ కాంప్లెక్స్, సీతారాంపురం తదితర సెంటర్లలో గస్తీ నిర్వహించి సరైన పత్రాలు లేని 24 మోటారు సైకిళ్లు, రెండు బొలేరోలు, ఆటోతో పాటు మద్యం తాగి నడుపుతున్న రెండు వాహనాలను సీజ్ చేసి కోర్టు ముందు ప్రవేశపెట్టామన్నారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగుతున్న 15 మందిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ సందర్భంగా సీఐ నాగదుర్గారావు మాట్లాడుతూ ఎవరైనా తమ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ముగిసిన ప్రపంచ పర్యావరణ వారోత్సవాలు



వాల్ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: జన విజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ వారోత్సవాలు ఈ నెల 5న మొదలై ఆదివారం ముగిశాయి. ముగింపు ఉత్సవాలను కాకినాడ జిల్లా యూటీఎఫ్ హోంలో నిర్వహించారు. పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల యువజన సమావేశం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించారు. పర్యావరణ-జన విజ్ఞాన వేదిక దృక్కోణం అనే అంశాన్ని పూర్వపు రాష్ట్ర అధ్యక్షుడు చల్లా రవికుమార్ వివరించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఘంటసాల చైతన్య వేదిక, జనవిజ్ఞాన వేదిక సంయుక్తంగా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం ప్రకటించి బ్యానర్ ప్రదర్శించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళి, రాష్ట్ర కోశాధికారి కె.శ్రీనివాసరావు, రాష్ట్ర పర్యావరణ కమిటీ కన్వీనర్ కేవీవీ సత్యనారాయణ, రాష్ట్ర యూత్ కమిటీ కన్వీనర్ టి.సురేష్, కాకినాడ జిల్లా గౌరవాధ్యక్షుడు వి.సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు జీఎస్‌హెచ్‌పీ వర్మ, మండపేట, కోనసీమ, కాట్రేనికోన, గొల్లప్రోలు తదితర ప్రాంతాలను నుంచి యువకులు పాల్గొన్నారు.

'గౌతమీ తీరం' కథాసంపుటి పరిచయ సభ



పుస్తక పరిచయ సభలో పాల్గొన్న మార్ని జానకీరామ్‌చౌదరి తదితరులు

కాకినాడ కల్చరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని శాస్త్రి కళాపీఠంలో సాహితీ స్రవంతి నగరశాఖ ఆధ్వర్యంలో పి.రత్నాకర్ రచించిన 'గౌతమీ తీరం' కథాసంపుటి పుస్తక పరిచయ సభ సాహితీవేత్త డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన ఆదివారం జరిగింది. గౌతమీ తీరం కథా సంపుటిలోని కథలన్నీ గోదావరి నది చుట్టూ అల్లుకొని ఉన్నాయని నగరశాఖ అధ్యక్షుడు మార్ని జానకీరామ్ చౌదరి అన్నారు. పలువురు వక్తలు రత్నాకర్ సాహిత్య సేవలను కొనియాడారు. చక్కటి పరిచయ సభ ఏర్పాటు చేసిన స్రవంతి సభ్యులకు కథాసంపుటి రచయిత పి.రత్నాకర్ ధన్యవాదాలు తెలిపారు. గనారా, డాక్టర్ కాళ్ళకూరి శైలజ పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు ఆదరణ ఎప్పటికీ తగ్గదు

జిల్లా పరిషత్ సీఈఓ సత్యనారాయణ



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గ్రంథాలయాలకు ఆదరణ ఎప్పటికీ తగ్గదని, సాంకేతిక ఎంత అభివృద్ధి చెందినా వాటి ప్రాబల్యం అలాగే ఉంటుందని జిల్లా పరిషత్ సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం ముందు నుంచి గ్రంథాలయ ఉద్యమం కొనసాగిందని, ఎందరో త్యాగమూర్తుల ఫలితంగా గ్రంథాలయాలు ఏర్పడ్డయన్నారు. ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానమని, గ్రంథాలయాల బాట పట్టేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి దూలం పద్మ వెంకన్నబాబు మాట్లాడుతూ ఇటీవలే జిల్లాలో ఉన్న అన్ని గ్రంథాలయాలకు దాదాపు కోటి రూపాయల నిధులతో పుస్తకాలు కొనుగోలు చేసి పంపిణీ చేశామని, విద్యార్థులకు, కాంపిటేటివ్ పోటీ పరీక్షలకు, ఇలా అన్ని వర్గాలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో 35 రోజుల పాటు వివిధ అంశాలపై అవగాహనతో పాటు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామని, విశేష స్పందన వచ్చిందన్నారు. సెట్రాజ్ సీఈఓ ఎస్.కే.ఇమ్రాన్ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎస్‌వీ ప్రసాద్, గ్రంథాలయ ఉప అధికారి వెంకటేశ్వరరావు, గ్రంథాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు తుమ్మలపల్లి జయకృష్ణ, ములంపాక శ్రీనివాసరావు, శ్రావ్య, కుమార్, కిషోర్ పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

తొండంగి: గోపాలపట్నంలోని ఓ ఇంట్లో చోరీకీ యత్నించి ఇంటి యజమానులకు చిక్కిన వ్యక్తిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... గోపాలపట్నం ఎస్‌బీఐ బ్యాంకు వీధిలోని ఓ ఇంట్లో చోరీ చేసేందుకు వ్యక్తి ప్రవేశించాడు. దీనిని గమనించిన ఇంటి యజమాని అతడిని పట్టుకుని 112 నంబరుకు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్నవరం హెచ్‌సీ గణేష్, పీసీ అర్జున్ స్పందించారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టుకుని తొండంగి పోలీసు సిబ్బందికి అప్పగించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.